క్లుప్తంగా

మాస్ కాపీయింగ్‌కు పాల్పడితే చర్యలు

యాడికి: ఇంటర్ పరీక్షల్లో మాస్ కాపీయింగ్‌కు పాల్పడితే సంబంధిత అధికారులపై చర్యలు తప్పవని డీవీఈఓ వెంకటరమణనాయక్ హెచ్చరించారు. శుక్రవారం ఆయన స్థానిక మోడల్ స్కూల్లో జరుగుతున్న ఇంటర్ పరీక్షలను తనిఖీ చేశారు. కేంద్రంలో విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా చూసుకోవాలని నిర్వాహకులను ఆదేశించారు. ఇంటర్ మొదటి సంవత్సరం ఇంగ్లిష్ పరీక్షకు 141 మందికిగాను ఒకరు హాజరు కాలేదని చీఫ్ మారుతీ, డీఓ సుబ్రహ్మణ్యం తెలిపారు.

పెద్ద కదిరప్ప స్వామికి గొడుగు బహూకరణ


పెద్ద కదిరప్ప స్వామికి గొడుగును అందిస్తున్న దృశ్యం

గుత్తి: పూలకుంట గ్రామానికి చెందిన నగరూరు వెంకటన్న శుక్రవారం పెద్ద కదిరప్ప స్వామికి రథంపై ఏర్పాటు చేయడానికి రూ.50 వేలు విలువైన గొడుగును అర్చకుడు రామాంజనేయులుకు అందజేశారు. కాగా పెద్ద కదిరప్ప స్వామిని పల్లకీలో ఉంచి బ్రాహ్మణపల్లి, పూలకుంట గ్రామాల్లో ఊరేగించారు. అందరూ ఆయురారోగ్యాలు, అష్ట ఐశ్వర్యాలతో శాంతి యుతంగా జీవించాలని, పంటలు బాగా పండి అందరూ సుఖ సంతోషాలతో ఉండాలని కోరుతూ ఏటా స్వామిని 20 రోజులు పాటు మండలమంతా ఊరేగిస్తారు.

నేడు ఆలూరు ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవం

తాడిపత్రి: ఆలూరు గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో శనివారం సాయంత్రం 4.30 గంటలకు పాఠశాల వార్షికోత్సవం నిర్వహించనున్నట్లు పాఠశాల ఉపాధ్యాయులు గంగాధర్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. ఎంపీపీ సరస్వతి, యువనాయకుడు కేతిరెడ్డి హర్షవర్ధన్ రెడ్డి, తహసీల్దార్, ఎంపీడీఓ, ఎంఈఓ నాగరాజు, రూరల్ సీఐతో పాటు గ్రామ సర్పంచ్ సుబ్బయ్య, పలు ఉన్నత పాఠశాలలకు చెందిన ప్రధానోపాధ్యాయులు హాజరవుతారన్నారు.

నల్లబ్యాడ్జీలతో నిరసన


నిరసన తెలుపుతున్న ఎంవీఐలు, సిబ్బంది

తాడిపత్రి టౌన్: స్థానిక వ్యవసాయ మార్కెట్టు యార్డ్‌లోని మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయం ఎదుట శుక్రవారం కాకినాడలో ఎంవీఐ చిన్నారావుపై కత్తితో జరిగిన దాడిని ఖండిస్తూ ఎంవీఐలు, సిబ్బంది నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఎంవీఐపై దాడికి పాల్పడిన వ్యక్తిని వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎంవీఐలు శ్రీనివాసులు, వేణుగోపాల్, సిబ్బంది పాల్గొన్నారు.

వడ్డీ మాఫీని సద్వినియోగం చేసుకోండి

తాడిపత్రి టౌన్: ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో మున్సిపాలిటీ పరిధిలో ఆస్తి, ఖాళీ స్థలాల పన్ను బకాయిదారులు ఈనెల 31 లోపు ఒకే సారి పన్ను చెల్లిస్తే వడ్డీ మినహాయింపు వర్తిస్తుందని మున్సిపల్ కమిషనర్ జబ్బార్‌మియా ఓ ప్రకటనలో తెలిపారు. అవకాశాన్ని పన్ను బకాయిదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

గుంతకల్లు రూరల్: ఆస్తి పన్ను బకాయిదారులు ఈనెలాఖరులోగా ఒకేసారి పన్ను చెల్లిస్తే వడ్డీ మాఫీ చేస్తామని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. బకాయిదారులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఘనంగా వసంతోత్సవం


అలంకరణలో వేంకటేశ్వరుడు

యల్లనూరు: మండల కేంద్రంలోని వేంకటేశ్వర ఆలయంలో వసంతోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు నరసింహశర్మ, విజయ్ స్వామిని ఉదయం నుంచి ప్రత్యేక పుష్పాలతో అలంకరించి పూజలు చేశారు. సాయంత్రం స్వామిని హంస వాహనంపై ఊరేగించారు. శనివారంతో బ్రహ్మోత్సవాలు ముగియనున్నట్లు ఆలయ ఈఓ శోభరాణి తెలిపారు.

గార్లదిన్నెలో మోస్తరు వర్షం

గార్లదిన్నె: మండల వ్యాప్తంగా గురువారం రాత్రి, శుక్రవారం ఓ మోస్తరు వర్షం కురిసింది. అల్పపీడన ప్రభావంతో గ్రామాల్లో ఉరుములు, మెరుపులుతో చిరుజల్లులు కురిశాయి. రోజంత ఆకాశం మేఘావృతమైంది. చాలా గ్రామాల్లో ఒక పదును వర్షం కురవడంతో రైతులు ఆనందం వ్యక్తం చేశారు.

రైలు బండి.. ఎప్పుడొస్తుందో తెలియదండి!

- గంటల కొద్దీ ఆలస్యంగా నడుస్తున్న ప్యాసింజర్ రైళ్లు
- విసుగెత్తిపోతున్న ప్రయాణికులు
- సమస్య పరిష్కరించాలని డిమాండ్


కదిరిదేవరపల్లి ప్యాసింజర్ రైలు కోసం వేచి ఉన్న ప్రయాణికులు

గుంతకల్లు: కదిరిదేవరపల్లి–తిరుపతి, కాచిగూడ–గుంతకల్లు ప్యాసింజర్ రైళ్లు గుంతకల్లు స్టేషన్‌కు ఎప్పుడు వస్తాయో, ఎప్పుడు గమ్యస్థానం చేరుతాయో తెలియక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ప్యాసింజర్ రైళ్ల టిక్కెట్ ధర ఎక్స్‌ప్రెస్ రైళ్ల కంటే తక్కువగా ఉండడంతో సామాన్య ప్రయాణికులు వాటిలో రాకపోకలకు మక్కువ చూపుతారు. అయితే కరోనా సమయంలో దాదాపు 6 నెలల పాటు రైళ్లను రద్దు చేసిన విషయం తెలిసిందే. కరోనా తగ్గుముఖం పట్టిన తర్వాత ఈ ప్యాసింజర్ రైళ్లను స్పెషల్ ప్యాసింజర్ రైళ్ల పేరుతో మార్పు చేసి ధరలను రెట్టింపు చేశారు. ఉదాహరణకు కదిరిదేవరపల్లి ప్యాసింజర్ రైళ్లలో గుంతకల్లు నుంచి అనంతపురానికి గతంలో కేవలం రూ.20 ఉండేది. ఇప్పుడు రూ.40 వసూలు చేస్తున్నారు. అయితే బస్సు చార్జీలకు ఈ ప్యాసింజర్ రైళ్ల టిక్కెట్ ధరలకు చాలా వ్యత్యాసం ఉండడంతో పేద ప్రయాణికులు ఈ రైళ్లలోనే వెళ్తుంటారు. ఉమ్మడి అనంత జిల్లాతోపాటు బళ్లారి జిల్లా వాసులు తిరుపతికి వెళ్లేందుకు కదిరిదేవరపల్లి–తిరుపతి ప్యాసింజర్ రైలు(నం–07590) ఎంతో అనుకూలం. దీంతో ఈ రైలు ప్రయాణం పట్ల వెంకన్న భక్తులు మక్కువ చూపుతుంటారు. ఈ ప్యాసింజర్ రైలు గుంతకల్లు జంక్షన్‌కు సాయంత్రం 6.20 వచ్చి 6.30 గంటలకు వెళ్లాల్సి ఉంది. ఈ మధ్య కాలంలో ఈ రైలు ఏ రోజూ కూడా సరైన సమయానికి రాదు. గుంతకల్లు జంక్షన్‌కు రాత్రి 8.00లకు పైగా చేరుకుంటుంది. దీంతో నిత్యం వందల మంది తిరుపతికి వెళ్లే ప్రయాణికులు, విధులు ముగించుకొని అనంతపురం వెళ్లే ఉద్యోగులు స్టేషన్‌లోనే పడిగాపులు కాస్తుంటారు. గడిచిన గురువారం, బుధ, మంగళవారాల్లో ఈ రైలు గుంతకల్లు జంక్షన్‌కు రాత్రి 7.40 గంట నుంచి 8.10 గంటలకు చేరుకుని అనంతపురానికి రాత్రి 9.30 గంటలపైనే చేరుతోంది.

కాచిగూడ ప్యాసింజర్‌కు దెయ్యాల బండిగా పేరు..

ఇక కాచిగూడ–గుంతకల్లు ప్యాసింజర్ (07670) రైలు ఏనాడూ సమయానికి గుంతకల్లు జంక్షన్‌కు చేరిన దాఖలాలు లేవు. విసిగి వేసారిన ప్రయాణికులు అసహనంతో ఆ రైలుకు దెయ్యాల బండిగా పేరు పెట్టారు. ఈ బండిని ఎక్కాలంటే ప్రయాణికులు ఒకటికి రెండు సార్లు ఆలోచిస్తారు. కాచిగూడ రైల్వేస్టేషన్‌లో ఉదయం 10.05 గంటలకు బయలుదేరి ఈ ప్యాసింజర్ రైలు అనేక స్టేషన్లు దాటుకొని రాత్రి 8.15 గంటలకు గుంతకల్లు చేరాల్సి ఉంది. అయితే స్టేషన్‌లో ప్లాట్‌ఫారాల కొరత, క్రాసింగ్‌లు, చైను లాగడాలు తదితర కారణాల వల్ల ఏనాడూ ఈ రైలు అనుకున్న సమయానికి గుంతకల్లుకు చేరలేదు. ఎటు తిరిగి సరిగ్గా అర్ధరాత్రికి గుంతకల్లు రైల్వే జంక్షన్ చేరి ప్రయాణికుల సహనానికి పరీక్ష పెడుతుంది. దీంతో ముఖ్యంగా మహిళలు ఈ రైలు ఎక్కాలంటేనే భయపడిపోతారు. స్టేషన్ బయట పొలాల్లో గంటల తరబడి ఈ రైలు నిలిచిపోతుంది. ఊరి బయట చిమ్మచీకట్లో బిక్కుబిక్కుమంటూ ప్రయాణికులు బండిని తిట్టుకోవడం రోజూ జరిగే తంతే. గుంతకల్లులోకి ప్రవేశించే సమయంలో రైల్వే స్టేషన్ ఔటర్ డీఆర్‌ఎం కార్యాలయ సమీపంలో అనేక సార్లు గంటల కొద్దీ నిలిచిపోయి ప్రయాణికుల బ్లెడ్‌ప్రెషర్‌ను పరీక్షిస్తుంది. చేసేదేమి లేక డీఆర్‌ఎం ఆఫీస్ సమీపాన రైలు బ్రిడ్జి వద్ద ప్రయాణికులు రైలు దిగి ముళ్లకంపల మధ్య నడుచుకుంటూ ఇళ్లకు వెళుతుంటారు. వారం రోజులుగా ఈ ప్యాసింజర్ రైలు రాత్రి కూడా 10.00 గంటలకు చేరుకున్న ఈ రైలు ఔటర్ నుంచి జంక్షన్‌లోకి 11.00 గంటలకుపైగా చేరింది. ఇలా గుంతకల్లు మీదుగా నడిచే పలు ప్యాసింజర్ రైలు గంటల కొద్దీ ఆలస్యంగా నడుస్తున్నాయి. రైల్వే అధికారులు కూడా ప్యాసింజర్ రైళ్ల పట్ల శ్రద్ధ చూపకపోవడం వల్ల ఈ రైళ్లు ఆలస్యంగా నడుస్తున్నాయని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు.

ఈ రైల్లో నరకం అనుభవించాం



ఈ కాచిగూడ రైల్లో డోన్ నుంచి గుంతకల్లుకు వచ్చాను. డోన్‌లోనే కాస్త ఆలస్యంగా వచ్చిన ఈ రైలు గుంతకల్లుకు రాత్రి 10.00 ఔటర్‌కు(డీఆర్‌ఎం కార్యాలయ సమీపంలో) చేరుకుంది. మరో 10 నిమిషాల్లో ఇంటికెళ్లొచ్చు అని భావిస్తే 10.50 గంటలకు రైలు కదిలింది. దీంతో గంటపాటు ఇక్కడ చాలా అవస్థలు పడాల్సి వచ్చింది.

– రాజు, ప్రయాణికుడు

ప్రయాణమంటేనే బేజారొస్తుంది



మాది ఉరవకొండ నియోజకవర్గంలోని రాగులపాడు. తిరుపతి వెంకన్న స్వామి దర్శనానికి కదిరిదేవరపల్లి–తిరుపతి ప్యాసింజర్ రైలు ఎంతో అనుకూలమాని కుటుంబసభ్యులతో కలిసి ఎప్పుడూ ఈ రైలులోనే వెళ్తుంటాం. సాయంత్రం 5.00 గంటలకే స్టేషన్‌కు వస్తే రాత్రి 7.45 గంటలు కావొస్తున్న ఇంత వరకు రాలేదు. దీంతో ఎప్పుడూ తిరుపతికి వెళ్లిన రైలు సమయానికి రావడం లేదు. ఈ రైలు ప్రయాణమంటేనే బేజారొస్తుంది.

–ప్రవీణ్, ప్రయాణికుడు

మొబైల్ షాపు నిర్వాహకుడిపై దాడి

గుత్తి: పట్టణంలోని అమృత్ సినిమా థియేటర్ ఎదురుగా మొబైల్ షాపు నిర్వాహకుడు వెంకటేష్ నాయక్‌పై శుక్రవారం ఎస్సీ కాలనీకి చెందిన సాయి అనే యువకుడు దాడి చేశాడు. వివరాల్లోకి వెళితే.. వెంకటేష్ నాయక్ కూరగాయల మార్కెట్ వద్ద ఉండగా సాయి అనే యువకుడు వెంకటేష్ నాయక్‌తో గొడవ పెట్టుకున్నాడు. వెంకటేష్ నాయక్‌పై దాడి చేసి కొట్టాడు. బైక్ తాళాలు కూడా తీసుకెళ్లాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

గుత్తిలో యువకునిపై దాడి

పట్టణంలోని అనంతపురం రోడ్డులో శుక్రవారం చెన్నకేశవులు అనే యువకునిపై ఇద్దరు వ్యక్తులు దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. వివరాల్లోకి వెళితే.. పట్టణంలోని బండగేరికి చెందిన చెన్న కేశవులు అనంతపురం రోడ్డు వైపు బైక్‌పై బయలుదేరాడు. అయితే హీరో షోరూమ్ ఎదురుగా ఆటో బైక్‌కు అడ్డం వచ్చింది. దీంతో చెన్నకేశవులు ఆటో డ్రైవర్‌ను ఏమి కనిపించలేదా? అన్నాడు. దీంతో రెచ్చిపోయిన ఆటో డ్రైవర్ మరో వ్యక్తితో కలిసి చెన్న కేశవులుపై దాడి చేశారు. దాడిలో చెన్న కేశవులు చెయ్యి విరిగింది. పలు చోట్ల గాయాలయ్యాయి. స్థానికులు గమనించి అతడిని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

22 నుంచి వసంత నవరాత్రి ఉత్సవాలు

పామిడి: ఎద్దులపల్లిలోని ఉమా మహేశ్వర సీతారామాంజనేయ ఆలయంలో ఉగాది నుంచి శ్రీరామ నవమి వరకూ వసంత నవరాత్రులు నిర్వహిస్తున్నట్లు శుక్రవారం గ్రామస్తులు తెలిపారు. గ్రామస్తుల ఆధ్వర్యంలో ఈనెల 22 నుంచి 29 వ తేదీ వరకూ పూజలు నిర్వహిస్తామన్నారు. 29న ఉదయం 7 గంటల నుంచి రాత్రి వరకూ హనుమాన్ చాలిసా పారాయణం ఉంటుందన్నారు. 30న సీతారామ కల్యాణోత్సవం ఉంటుందని వివరించారు.

మార్కెట్‌యార్డును అభివృద్ధి పథంలో నడుపుతాం


మాట్లాడుతున్న మార్కెట్ యార్డ్ చైర్మన్ హరినాథరెడ్డి

తాడిపత్రి టౌన్ : వ్యవసాయ మార్కెట్ యార్డ్‌ను అభివృద్ధి పథంలో నడుపుతామని మార్కెట్ యార్డ్ చైర్మన్ హరినాథరెడ్డి, వైస్ చైర్మన్ ఓబులరెడ్డి పేర్కొన్నారు. స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డ్ కార్యాలయంలో శుక్రవారం సెక్రటరీ ఆనంద్ అధ్యక్షతన కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2022–23కు రూ.1.76 కోట్లు లక్ష్యం కాగా ప్రస్తుతానికి రూ.1.77 కోట్ల పన్నులు వసూలు చేశామన్నారు. అలాగే 2022–23కు వ్యవసాయ మార్కెట్ పరిధిలో రూ.1,99,38,684 ఆదాయం రాగా, రూ.86,78,995 ఖర్చు చేశామని తెలిపారు. రైతులు పండించిన పంటలను భద్రపరుచుకునేందుకు వీలుగా పెద్దపప్పూరు, పెద్దవడుగూరులో గోడౌన్ నిర్మాణాలకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతున్నామన్నారు. అనంతరం రైతుల సమస్యలపై అధికారులు, కమిటీ సభ్యులతో చర్చించారు. వ్యవసాయ శాఖ ఏడీ చెంగలరాయుడు మాట్లాడుతూ ఖరీఫ్, రబీ సీజన్లలో పంట సాగు చేసిన ప్రతి రైతు ఈ క్రాప్ బుకింగ్ చేసుకునేలా అవగాహన కల్పించాలని కమిటీ సభ్యులు, అధికారులను కోరారు. ఈ క్రాప్ బుకింగ్‌తో సున్నావడ్డీ, ఇన్‌పుట్ సబ్సిడీ, పంటల బీమా వర్తిస్తాయన్నారు. మార్కెట్ కమిటీ అధికారులు రామచంద్ర, చంద్రానాయక్, అధికారులు కుళ్లాయిప్ప, కమిటీ సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

రూ.45 లక్షలతో జోడు లింగాల రథం


టేకు కట్టెని తీసుకువస్తున్న వాహనాన్ని ఊరేగింపుగా తీసుకొస్తున్న దృశ్యం

కూడేరు: దక్షిణ భారత దేశంలోని శివాలయాల్లో ఒక్కటిగా ప్రఖ్యాతి గాంచిన కూడేరులోని శివపార్వతుల జోడు లింగాల సంగమేశ్వర స్వామి ఆలయానికి సుమారు రూ.45 లక్షలతో రథాన్ని తయారు చేయించేందుకు దాతలు ముందుకు వచ్చారు. శుక్రవారం ఉరవకొండ మండలం నిబంబగల్లు, మహదేవపురం, చిత్రదుర్గానికి చెందిన కోకా వంశీకులు రథం తయారీకి అవసరమై టేకు కట్టెని సుమారు రూ.11లక్షలు వెచ్చించి కూడేరు తీసుకువచ్చారు. భక్తులు భజనతో గ్రామంలో నుంచి దేవాలయం వరకూ ఊరేగింపుగా తీసుకెళ్లారు. ఈ సందర్భంగా దాతలు మాట్లాడుతూ నూతన రథం తయారీకి సుమారు రూ.45 లక్షల వరకు ఖర్చవుతుందన్నారు. త్వరలో మరో రూ.5 లక్షలు వెచ్చి మత్తి కట్టెని తీసుకు వస్తామన్నారు. ఇతర భక్తులతో కూడా విరాళాలు సేకరిస్తామన్నారు. రథం తయారీ పనులను వేగవంతం చేయించి వచ్చే ఏడాదికి నూతన రథం తయారయ్యేలా కృషి చేస్తామన్నారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్


ట్రాక్టర్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించిన దృశ్యం

యాడికి : అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను శుక్రవారం రాత్రి పోలీసులు పట్టుకున్నారు. తాడిపత్రి మండలం ఇగుడూరు గ్రామానికి చెందిన నాగేష్, శేషారెడ్డి ట్రాక్టర్‌లో ఇసుకను రవాణా చేస్తూ యాడికి పాత పోలీస్‌స్టేషన్ వద్ద పోలీసులకు పట్టుబడ్డారు. ట్రాక్టర్ యజమానిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్లు పోలీసులు తెలిపారు.

వాసవీమాతకు కొత్తచీరలతో అలంకరణ


కొత్త చీరల అలంకరణలో అమ్మవారు

అనంతపురం కల్చరల్: ఉగాది పర్వదినాలు రానుండడంతో కొత్తూరు ఆర్యవైశ్య అమ్మవారిశాలలో వాసవీమాతకు కొత్త చీరలతో అలంకరణ, అర్చన పూజలు శుక్రవారం చేశారు. ఉదయం నుంచి పెద్ద ఎత్తున తరలివచ్చిన మహిళా విభాగం ప్రతినిధులు, కార్యకర్తలు భజనలు, సంకీర్తనలతో అమ్మవారికి భక్తినీరాజనాలర్పించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు గోపా మచ్చా నరసింహులు, వాసవీ మహిళా మండలి అధ్యక్షులు నిర్మలదేవి మాట్లాడారు. శుభకృత్ నామ ఉగాదిని పురస్కరించుకుని ఈసారి ఘనంగా వేడుకలు జరుగుతాయన్నారు.

ప్రహరీ పనుల పరిశీలన

పుట్లూరు: మండలంలోని నారాయణరెడ్డిపల్లిలో శ్మశాన వాటిక ప్రహరీ నిర్మాణ పనులను శుక్రవారం మండల ఇంజినీర్ యల్లమనాయుడు పరిశీలించారు. గ్రామ సమీపంలోని ఎంపీ తలారి రంగయ్య నిధులు రూ.12 లక్షలతో పనులు చేపడుతున్నట్లు ఆయన తెలియజేశారు.

నేడు హుండీ కానుకల లెక్కింపు

ఆత్మకూరు: పంపనూరులోని సర్పరూప సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో శనివారం హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్నట్లు ఆలయ ఈఓ అక్కిరెడ్డి శుక్రవారం తెలిపారు. ఆసక్తి ఉన్న భక్తులు, గ్రామస్తులు దేవదాయ షరతులకు లోబడి హుండీ కానుకల లెక్కింపు కార్యక్రమంలో పాల్గొనొచ్చని తెలిపారు. ఈ నెల 20న ఉదయం 10 గంటలకు కొబ్బరి చిప్పలు సేకరించుకొను హక్కును దేవస్థాన ఆవరణలో బహిరంగ వేలం వేస్తున్నట్లు తెలిపారు.

ఆటో ఢీకొని వృద్ధుడికి గాయాలు


ప్రమాదంలో గాయపడిన వృద్ధుడు

గుత్తి : పట్టణంలోని మస్రో సత్రం వద్ద శుక్రవారం రోడ్డు దాటుతున్న షేక్షావలి అనే వృద్ధుడిని ఆటో ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. వివరాలు..పామిడి పట్టణంలోని సంత మార్కెట్‌కు చెందిన షేక్షావలి పని మీద గుత్తికి వచ్చాడు. పని ముగించుకుని తిరిగి పామిడికి వెళ్లడానికి ఆటో కోసం రోడ్డు దాటుతుండగా బైక్ ఢీకొంది. ఘటనలో తీవ్రంగా గాయపడిన అతడిని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఘటనపై పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

ఆహారపు అలవాట్లతో రుగ్మతలు

రాప్తాడు: మారుతున్న ఆహారపు అలవాట్లతోనే మనిషి అనేక రుగ్మతలకు గురవుతున్నాడని డీఆర్‌డీఏ జీవనోపాధుల డీపీఎం రాధారాణి పేర్కొన్నారు. మండలంలోని గంగలకుంటలో 2023 అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరం సందర్భంగా పోతులయ్య గ్రామ సంఘం సభ్యులకు అవగాహన కల్పించారు.

రూ.1.25 కోట్లతో పప్పూరమ్మ ఆలయ పునరుద్ధరణ


పప్పూరమ్మను దర్శించుకుంటున్న కేతిరెడ్డి హర్షవర్ధన్ రెడ్డి


ఆలయ తొలగింపు పనులు ప్రారంభిస్తున్న దృశ్యం

పెద్దపప్పూరు: చిన్నపప్పూరు గ్రామంలో శిథిలావస్థకు చేరిన పప్పూరమ్మ ఆలయ పునరుద్ధరణకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఇందుకోసం రూ.1.25 కోట్లు మంజూరు చేసింది. శుక్రవారం ఆలయ పునరుద్ధరణ పనులకు భూమిపూజ నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ యువనేత కేతిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మూల విరాట్‌ను పురావస్తు, రెవెన్యూ, దేవదాయ, పోలీస్ శాఖ సమక్షంలో పప్పూరమ్మ విగ్రహాన్ని అక్కడి నుంచి తొలగించి మరొకచోట ధాన్యంలో భద్రపరిచారు.

40 ఏళ్లకు మోక్షం..

దాదాపు 40 ఏళ్లుగా ఆలయం శిథిలావస్థలో ఉంది. ఆలయాన్ని పునరుద్ధరించాలని గ్రామస్తులు పలమార్లు అప్పటి పాలకులకు అడిగినా ప్రయోజనం లేకపోయింది. అమ్మవారి ఆలయ భూములను కౌలుకు తీసుకుని లబ్ధిపొందుతున్న జేసీ సోదరులు ఆలయాభివృద్ధి గురించి పట్టించుకోలేదు. 2019 ఎన్నికల ప్రచారం చిన్నపప్పూరుకు వచ్చిన సమయంలో కేతిరెడ్డి పెద్దారెడ్డి స్థానికుల కోరిక మేరకు ఆలయ పునరుద్ధరణకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ మేరకు ఆయన స్వయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి రూ.1.25 కోట్లు మంజూరు చేయించారు. కార్యక్రమంలో గ్రూప్ టెంపుల్ ఈఓ సుబ్రమణ్యం, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

తాడిపత్రి: చిన్నపొడమల గ్రామంలో చెన్నకేశవ స్వామి దేవస్థానం పునరుద్ధరణ పనులను శుక్రవారం ఉదయం వైఎస్సార్‌సీపీ యువనేత కేతిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి భూమిపూజ చేసి ప్రారంభించారు. ఆలయం శిథిలావస్థకు చేరి కూలిపోయేందుకు సిద్ధంగా ఉంది. ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి చొరవతో ఆలయ పునరుద్ధరణ కోసం రూ. 1.25 కోట్లు ప్రభుత్వం ద్వారా మంజూరు చేయించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యేకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. అంతకు ముందు కేతిరెడ్డి హర్షవర్ధన్‌రెడి పక్కనే ఉన్న ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ పెద్దిరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పల్లెనాగేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

తాడిపత్రి: అనారోగ్యంతో ప్రైవేటు ఆస్పత్రుల్లో చికిత్స చేయించుకున్న ఇద్దరు లబ్ధిదారుల కుటుంబాలకు శుక్రవారం వైఎస్సార్‌సీపీ యువనేత కేతిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. మండలంలోని చిన్నపొడమల గ్రామానికి చెందిన ఇద్దరు సీఎంఆర్‌ఎఫ్ కోసం దరఖాస్తు చేసుకోగా, వారికి రూ.1.75 లక్షలు మంజూరయ్యాయి. దీంతో ఆయన స్వయంగా గ్రామంలోని లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి చెక్కులను అందించారు. ఉప సర్పంచ్ పెద్దిరెడ్డి, మండల కన్వీనర్ పల్లె నాగేశ్వర్‌రెడ్డి ఉన్నారు.

బాలిక అదృశ్యం

యాడికి: మండల కేంద్రానికి చెందిన ఓ బాలిక అదృశ్యమైంది. వివరాలు.. అంత్రాల వీధికి చెందిన సూరిబాబు గురువారం ఉదయం అంగడికి వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు తెలిసిన చోట్ల వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో బాలిక తల్లి నీలావతమ్మ శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ గురుప్రసాద్‌రెడ్డి తెలిపారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం


మాట్లాడుతున్న డాక్టర్ యుగంధర్

బుక్కరాయసముద్రం: పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని, గర్భిణులు తప్పనిసరిగా పౌష్టికాహారం తీసుకోవాలని జిల్లా మదర్, చైల్డ్ అధికారి డాక్టర్ యుగంధర్ పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని పట్టణ ఆరోగ్య కేంద్రంలో గర్భిణుల చికిత్స కేంద్రాన్ని పరిశీలించారు. గర్భిణులు ప్రతి నెలా ఎంత మంది పీహెచ్‌సీకి వస్తున్నారని వివరాలు అడిగి తెలుసుకున్నారు. గర్భిణులు ఆరోగ్య సూత్రాలు పాటించాలని సూచించారు. రక్తహీనత ఉన్నవారు తప్పనిసరిగా ఐరన్ మాత్రలు వేసుకోవాలన్నారు. ప్రతి నెలా పరీక్షలు చేయించుకోవాలన్నారు. డాక్టర్ స్వాతి లక్ష్మి, సీహెచ్‌ఓ మోహన్‌రావు, సూపర్‌వైజర్లు ఈశ్వరమ్మ, పీహెచ్‌ఎన్ చెన్నమ్మ, ల్యాబ్ టెక్నీషియన్ శ్రీనివాసులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అకాల వర్షంతో పంట నష్టం


మేడిమాకులపల్లిలో నేలకొరిగిన కొర్ర పంట

పెద్దవడుగూరు: మండలంలో శుక్రవారం తెల్లవారు జామున కురిసిన భారీ వర్షం కారణంగా కొర్ర, జొన్న, మామిడి తదితర పంటలు దెబ్బతిన్నాయి. మేడిమాకులపల్లి, పెద్దవడుగూరు, తెలికి, కాశేపల్లి, చిన్నవడుగూరు తదితర గ్రామాల్లో దాదాపు 300 ఎకరాల్లో పంట నష్టం వాటిల్లినట్లు బాధిత రైతులు నాగిరెడ్డి, రమణ, రామాంజినేయులు తెలిపారు. పత్తి పంట దెబ్బతిన్న తర్వాత రెండో పంటగా సాగు చేసుకున్నామని, ఎకరానికి రూ.20 వేల దాకా పెట్టుబడులు పెట్టామన్నారు. ఇలాగే మరో రెండు వర్షాలు కురిస్తే చేతికి వచ్చిన పంట నాశనం అవుతుందని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని కోరారు. కొండూరు, నాగలాపురం, వీరన్నపల్లి తదితర గ్రామాల్లోని మామిడి పంట దెబ్బతిందని రైతులు తెలిపారు.

ముగ్గురికి గాయాలు

గుత్తి: పట్టణ శివారులోని గుంతకల్లు రోడ్డులో చెరువు కట్ట వద్ద శుక్రవారం కూలీలతో వెళుతున్న ఆటోను వెనుక నుంచి స్కార్పియో వాహనం ఢీ కొన్న ఘటనలో ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. వివరాలు.. గుంతకల్లు మండలం పాత కొత్త చెరువు గ్రామానికి చెందిన ఏడు మంది కూలీలు ఆటోలో తాడిపత్రిలో రైల్వే పనులకు బయలు దేరారు. అయితే మార్గం మధ్యలోని గుత్తి చెరువు కట్ట వద్ద వెనుక నుంచి ఆటోను స్కార్పియో వాహనం ఢీ కొనింది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న అనిల్, రామాంజనేయులు, నవీన్ తీవ్రంగా గాయపడ్డారు. 108 వాహనంలో క్షతగాత్రులను గుత్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ సంఘటనపై పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.